క్లుప్తంగా

సన్మానం



ఖానాపురం : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం నేపథ్యంలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని మండలానికి చెందిన మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ సోమవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. సభ విజయవంతానికి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియామకం


ఎం.యాకూబ్

వర్ధన్నపేట : దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణంలోని మూడో డివిజన్‌కు చెందిన మారముల్లా యాకూబ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులు తుమ్మల కుమారస్వామ, చల్ల మిథున్, కంజర్ల సమ్మయ్య, మునిగాల అరుణ్‌కుమార్, కొండేటి రామచంద్రంలకు కృతజ్ఞతలు తెలిపారు.

'అర్హుల ఎంపికలో అవకతవకలు'



వర్ధన్నపేట : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయంటూ అడిషనల్ కలెక్టర్‌కు ప్రజాసంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌పీఐ జిల్లా కార్యదర్శి వల్లం దాసు కుమార్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ రాజు, టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బొట్ల రమేశ్ సమస్యను అదనపు కలెక్టర్‌కు వివరించారు. లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అర్హులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు.

తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోండి

దుగ్గొండి : వరి కోత సమయంలో ధాన్యంలో తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హార్వెస్టర్ యజమానులకు తహసీల్దార్ రవిచంద్రారెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో హార్వెస్టర్ యజమానులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యంలో తాలు రాకుండా మిషన్ బ్లోయర్ స్పీడ్ పెంచాలని సలహా ఇచ్చారు. తాలు వస్తుండడంతో రైతుల నుంచి మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు నష్టపోయే అవకాశం ఉన్న నేపథ్యంలో తాలు లేకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో నాయబ్ తహసీల్దార్ ఉమారాణి, ఆర్ఐ రాంబాబు, ఏఓ మాధవి, ఏఈఓలు హన్మంతు, విజయ్, రాజేశ్, వైజయంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

సంగెం : మండల కేంద్రానికి చేందిన వల్లాల లింగమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి గ్రామ వాట్సాప్ గ్రూప్ ద్వారా సేకరించిన రూ.31,828 నగదును మృతుడి సతీమణి సుజాత, కూతురు అక్షయలకు పులి రాజశేఖర్ సోమవారం అందజేశారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడారు. గ్రామ వాట్సప్ గ్రూప్ ద్వారా విరాళాలు అహ్వానించగా పలువురు స్పందించారని తెలిపారు. తొలుత లింగమూర్తి చిత్రపటానికి రాజశేఖర్, తదితరులు నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గుండేటి కుమారస్వామి, గుండేటి బాబు, నరహరి, మాజీ ఎంపీటీసీ పులి వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్ కక్కెర్ల శరత్, గౌడ సంఘం అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు పులి రాజు, ఇప్పకాయల విజయ్ ప్రకాశ్, చిన్న స్వామి, జూలురి పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణే లక్ష్యం

వరంగల్ : జిల్లాలో బాల్యవివాహాల నివారణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు షేర్ స్వచ్ఛంద సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లాల కోఆర్డినేటర్ తోట శిరీష తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ కోసం అవగాహన, ప్రచారం చేపట్టినట్టు తెలిపారు. 2030 నాటికి బాల్య వివాహాలను నివారించేలా బాల్య వివాహ రహిత భారత ప్రచారాన్ని నిర్వహిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

హైలెవల్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో..?

- వేసవిలో పూర్తి చేయకుంటే తప్పని తిప్పలు
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలో హైలెవల్ బ్రిడ్జి ఎప్పుడు నిర్మిస్తారో..? అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వేసవిలో పూర్తి చేయకుంటే రైతులకు, ప్రజలకు తిప్పలు తప్పవు. వర్షాకాలంలో చెరువులు మత్తళ్లు పోసినప్పుడు లోలెవల్ బ్రిడ్జి దాటడంలో ఎదురయ్యే సమస్యలు ప్రజలు, వాహనదారులకు పరిపాటిగా మారాయి. వర్షాకాలంలో నర్సంపేటకు రావాలంటే గురిజాల నుంచి చెన్నారావుపేట, గిర్నిబావి మీదుగా చుట్టూ తిరిగి రావాల్సిందే. సమస్య వచ్చినప్పుడే హడావుడి చేస్తూ తదనంతరం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు మత్తడి ఉధృతంగా పోసినప్పుడు లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిన్నడంతో గ్రామస్తులే తాత్కలిక మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. ఆ వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు చూసిన దాఖలాల్లేకపోవడం గమనార్హం.

గురిజాల శివారులో దశాబ్దాల క్రితం లోలెవల్ బ్రిడ్జి నిర్మించారు. ఏటా వర్షాకాలంలో గురిజాల పెద్ద చెరువు మత్తడి పోస్తే ప్రజలు, ప్రయాణికులు బ్రిడ్జి దాటే పరిస్థితి ఉండదు. ఈ క్రమంలో ప్రజలు గురిజాల నుంచి నర్సంపేట రావాలంటే తిప్పలు తప్పవు. గతంలో వాగు ఉధృతిలో ఒకరు ప్రమాదవశాత్తు కొట్టుకోపోయి రెండ్రోజుల తర్వాత శవం లభించిన దారుణం గ్రామస్తులను కంటి మీద కునుకు లేకుండా చూసింది. నాటి ప్రభుత్వం రోడ్డు మంజూరు చేయగా పనులు పూర్తయ్యాయి. లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం మాత్రం చేపట్టలేదు. లోలెవల్ కాజ్‌వేపై వర్షాకాలంలో వరద ఉధృతి ఎక్కువ. ఈ క్రమంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులను, కలెక్టర్‌ను, మంత్రులను కలిసి విన్నవించగా రూ.3.20 కోట్ల అంచనా వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. కాగా రెండుసార్లు టెండర్లు రద్దయ్యాయి. ఈ క్రమంలో ఏటా వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. గురిజాల, గుంటూరుపల్లి, చిన్న గురిజాల, జీజీఆర్‌పల్లి, లింగాపురం, కోనాపురం వెళ్లే రహదారి కావడంతో వాహనదారులు బ్రిడ్జి వద్ద నానా తంటాలు పడాల్సి వస్తోంది. పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గురిజాల లోలెవల్ బ్రిడ్జి

టెండర్ పూర్తి కాగానే పనులు

నర్సంపేట నుంచి గురిజాలకు వెళ్లే రోడ్డుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.3.20 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. త్వరలో ఆన్‌లైన్ టెండర్ ఖరారు అవుతుంది. టెండర్ పూర్తి కాగానే పనులు ప్రారంభించే దిశగా చొరవ తీసుకుంటాం.

\- రజనీకాంత్, ఏఈ, పీఆర్ శాఖ

దెబ్బతిన్న గురిజాల లోలెవల్ బ్రిడ్జి

గురిజాలలో లోలెవల్ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిన్నది. గతంలో వరద ఉధృతికి సీసీ కొట్టుకపోయి సలాకులు లేచాయి. దీంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ఓవైపు సీసీ వేసుకుని తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. బ్రిడ్జి సైడ్‌కు ఉన్న దిమ్మెలు సైతం వరద ఉధృతికి విరిగిపోయాయి. వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని లోలెవల్ వాగును దాటాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. భారీ వాహనాలు వస్తే లోలెవల్ బ్రిడ్జిలో దిగబడుతాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో రోడ్డుపై ఉన్న గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు అనేకం.

అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలో ముగ్దుంపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి సోమవారం సందర్శించారు. వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. 'అంగన్‌వాడీల్లో వసతులు కరువు' శీర్షికతో 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. అనంతరం ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలోని వంట గది తలుపు పూర్తిగా దెబ్బతిన్న విషయమై మరమ్మతు కోసం కార్యదర్శికి పలుమార్లు వినతిపత్రం అందించామన్నారు. విద్యుత్ సరఫరా విషయమై ఏఈని సంప్రదించి సమస్య పరిష్కరింపజేస్తామని చెప్పారు. భవనం బాగానే ఉందని తెలిపారు. చిన్నారులకు బోధన, ఇతర కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రంలోనే నిర్వహించాలని టీచర్‌ను ఆదేశించినట్టు వివరించారు.


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌కు గుణపాఠం


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్, పక్కన కుమారస్వామి, గోపాల్‌రావు తదితరులు

- బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మధుసూదన్

వర్ధన్నపేట : రజతోత్సవ సభకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించినా ప్రజలు భారీ సంఖ్యలో హాజరై సక్సెస్ చేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్ తెలిపారు. పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావులతో కలిసి మధుసూదన్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత సభతో నిరూపితమైందని చెప్పారు. సభను సక్సెస్ చేశారంటూ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో యూత్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, చొప్పరి సోమన్న, సిలువేరు కుమారస్వామి, తోటకూర రాజమణి, బానోత్ అనిత శ్రీనివాస్, సురేశ్, కొండేటి శ్రీనివాస్, ఇన్‌చార్జ్‌లు కంజర్ల రవీందర్, మార్త సారంగపాణి, అశోక్, సుధాకర్, వీరస్వామి, కేదారి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

'చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాడాలి'

నల్లబెల్లి : సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం సవరించడాన్ని వ్యతిరేకిస్తూ పోరాడాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం కోరారు. మండలంలోని భార్గవి ఇండస్ట్రీస్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాల సవరణతో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను క్రమబద్ధీకరించడంతోపాటు సుప్రీంకోర్టు తీర్పు మేరకు రూ.26 వేల చొప్పున కనీస వేతనం అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, పిండి రాజు, ఈర్ల రవి, దేవరాజు, కోమాండ్ల రమేశ్, వైనాల రవి, జన్ను రవి, తాళ్లపెల్లి రవి, సిద్ద లింగమూర్తి, కోమల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

- ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మకూరు : మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో సోమవారం ఎఫ్ఎంఎం, ×మా॰సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మహిళా సాధికారత సాధించడంతో పాటు పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని సూచించారు. తద్వారా పిల్లలపై హింసలేకుండా చూడవచ్చని అన్నారు. బాలలపై హింస జరిగినప్పుడు చైల్డ్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎంఎం డైరెక్టర్ సహాయ, కోఆర్డినేటర్లు కరుణ, శ్రీకాంత్, మా సంస్థ కార్యదర్శి శివప్రసాద్, ఎంపీఓ విమల, పంచాయతీ కార్యదర్శి శ్వేత, విజయ, స్రవంతి, ఉమ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

వృద్ధురాలి ఆత్మహత్య

దామెర : అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొడు సమ్మక్క (70) కొంతకాలంగా అస్తమా, మానసిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కాగా ఆదివారం రాత్రి ఇంటి ఎదుట నిద్రిస్తున్న సమ్మక్క ఉదయం కనిపించలేదు. దీంతో బంధువులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. కాగా గ్రామానికి సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బావి నుంచి సమ్మక్క మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మృతిరాలి కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అప్రమత్తత అవసరం

ఖిలా వరంగల్ : రైలులో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కోరారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్లాట్ ఫారాలు, రైల్వే స్టేషన్ ఆవరణలో ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రైలు ప్రయాణంలో అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించినా, వస్తువులు కనిపించినా వెంటనే ఆర్పీఎఫ్ కంట్రోల్ నంబర్ 139కు సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికులు తమ బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వపై అధికారుల విచారణ

ఖానాపురం : మండలంలోని పెద్దమ్మగడ్డకు చెందిన ఓ వ్యాపారి ఇతర ప్రాంతాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసి ధాన్యం నిల్వ చేయడంపై అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. ఓ వ్యాపారి ధాన్యాన్ని లారీల్లో తీసుకొచ్చి పెద్దమ్మగడ్డలో నిల్వ చేయగా రైతుల నుంచి కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నాడని అధికారులక సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ కిరణ్‌కుమార్, పీఏసీఎస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ఏఓ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్సై రఘుపతి ధాన్యం రాసులను సందర్శించి విచారణ చేపట్టారు. పలువురి నుంచి వివరాలు సేకరించారు. ధాన్యం నిల్వపై నివేదిక పంపిస్తామన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ధాన్యాన్ని తరలించొద్దని వ్యాపారికి అధికారులు స్పష్టం చేశారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

నల్లబెల్లి : మండలంలోని నందిగామలో భూక్య అనిల్, భాస్కర్‌లపై దాడి చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామంలో భాస్కర్, సురేశ్, పోరిక అనిల్ ధాన్యానికి రాత్రి కాపలాగా ఉన్న సమయంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నల్లకుంటకు చెందిన పోరిక రాజు, యశ్వంత్ చేతిలో బీరుసీసాలతో అనుమానాస్పదంగా తచ్చాడుతూ కనిపించారు. దీంతో వారిని సురేశ్, అనిల్ ప్రశ్నించగా గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో రేలకుంటకు చెందిన రతన్ అక్కడకు చేరుకుని గొడవను అడ్డుకునేందుకు యత్నించాడు. కాగా అదే సమయంలో పోరిక తిరుపతి, మూడు సురేశ్ ద్విచక్ర వాహనంపై అక్కడకు చేరుకుని కర్రలతో దాడి చేశారు. భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. దాడికి పాల్పడ్డ వారిలో ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు ఉన్నట్టు సమాచారం.

కొవ్వొత్తులతో నివాళి



గీసుకొండ : పహల్గాం ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓద్వారపు శంకర్‌రావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అనంతరం శంకర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ అలీ, ఆర్గనైజర్లు సింగారపు రాజ్‌కుమార్, చెంచు రాజయ్య, కార్యదర్శి కుమ్మరికుంట్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కనకాచారి, నాయకులు మల్లయ్య, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటకు చెందిన బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు కందాల చంద్రమౌళిని అతడి తల్లి వీరలక్ష్మి బాయి ఇటీవల మృతి చెందిన క్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. తొలుత వీరలక్ష్మి చిత్రపటానికి రాణాప్రతాప్‌రెడ్డి నివాళులర్పించారు.

'ఆపరేషన్ కగార్'ను ఆపేయాలి

ఖిలా వరంగల్: ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని, తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రిగుట్ట ప్రాంతంలో కేంద్ర పోలీస్ బలగాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పడమర కోట అమరవీరుల స్థూపం వద్ద నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదలు నేటి ఆపరేషన్ కగార్ వరకు అనేక మంది అమాయక ఆదివాసీ ప్రజలు కేంద్ర బలగాల చేతిలో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖనిజ సహజ సంపదను బడా కార్పొరేట్ శక్తులు, బహుళ జాతి కంపెనీలకు అప్పగించేందుకే ఈ నరమేధాన్ని కేంద్రం కొనసాగిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం బలగాలను ఉపసంహరించుకుని మావోయిస్టులతో చర్చలు నిర్వహించాలని సూచించారు.

వర్ధన్నపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటయ్య, కన్నయ్య తదితరులు



కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

నర్సంపేట/వర్ధన్నపేట/ఖానాపురం : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందని అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరె కుమారస్వామి, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య స్పష్టం చేశారు. చెన్నారావుపేట మండలం అమీనాబాద్, ఎల్లాయిగూడెం, పాపయ్యపేట, బోజెర్వు, తిమ్మరాయినిపహాడ్ గ్రామాల్లో సోమవారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అమీనాబాద్ సొసైటీ చైర్మన్ రవి ప్రారంభించగా చెన్నారావుపేటలోని పాత సొసైటీ కార్యాలయ ఆవరణలో కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమారస్వామి ప్రారంభించారు. అలాగే వర్ధన్నపేట మండలంలోని చెన్నారంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య ప్రారంభించగా ఖానాపురం మండలంలోని కొత్తూరు, రాగంపేట, రంగాపురం గ్రామాల్లో చెన్నారావుపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ధాన్యం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తోందని తెలిపారు. ధాన్యాన్ని ఆరబోసి తాలు లేకుండా తీసుకొచ్చి విక్రయించాలని సూచించారు. కార్యక్రమాల్లో నర్సంపేట మార్కెట్ డైరెక్టర్ చీర అశోక్, వైస్ చైర్మన్ పెండ్లి మల్లయ్య, చెన్నారావుపేట ఏఓ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చెన్నారావుపేట, వర్ధన్నపేట మండల అధ్యక్షులు భూక్యా గోపాల్‌నాయక్, ఎద్దు సత్యం, ఖానాపురం సొసైటీ సీఈఓ చిట్టె రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట : చెన్నారావుపేటలో..


ఖానాపురంలో..

'ముదిరాజ్'లను బీసీ'ఏ'లో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు

- ముదిరాజ్ సమాజ్ అధ్యక్షుడు యువరాజు

దుగ్గొండి : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సమాజ్ (టీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం ములుగు జిల్లా మేడారం జాతర నుంచి చేపట్టిన పాదయాత్ర మండలంలోని గిర్నిబావికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర బృందానికి స్థానిక ముదిరాజ్ సంఘం నాయకులు, కులస్తులు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. అనంతరం యువరాజు మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కులస్తులను చైతన్యవంతం చేసే దిశగ కృషి చేస్తున్నట్టు తెలిపారు. 2009లో ఇచ్చిన జీఓను పునరుద్ధరిస్తూ తెలంగాణ బీసీ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యాపార, వాణిజ్య సంఘం అధ్యక్షుడు సార రాములు, నాయకులు ముత్యాల స్వామి, గొర్రె రఘు, జటబోయిన రాజు, పొన్నం రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే నిర్వహించాలి


నర్సంపేట : మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజేందర్, నాయకులు

నర్సంపేట : వచ్చే నెల 1న మేడే ఘనంగా నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా నాయకులు గొర్రె ప్రదీప్, మారపాక సుమన్ కోరారు. పట్టణంలో మేడే వాల్‌పోస్టర్లను శుక్రవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వరంగ సహజ వనరులను, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేలా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా సవరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సమాఖ్య ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి బరిగల కుమార్, నాయకులు సుమన్, బాలు, కాకుల వెంకటస్వామి, కానుగుల రంజిత్, గొర్రె ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ ఆధ్వర్యంలో..

పట్టణంలో టీయూసీఐ ఆధ్వర్యంలో మేడే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు మాట్లాడారు. కార్మికులను బానిసత్వానికి గురి చేసేలా కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా సవరించిందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గుండపల్లి రాజేందర్, ఎం.అజయ్, విజేందర్, బాదావత్ రవి, భానోతు జవహర్‌లాల్, బాదావత్ రవీందర్, ఖలీల్, దార లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

జీపీ పంప్ ఆపరేటర్ మృతి

నెక్కొండ : స్థానిక గ్రామ పంచాయతీలో పంప్ ఆపరేటర్‌గా (వాటర్‌మెన్) విధులు నిర్వహిస్తున్న కందిక యాకయ్య (58) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. యాకయ్య మృతదేహానికి గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు చాగంటి వెంకటయ్య, ఈఓ సదానందం తదితరులు నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం యాకయ్య కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. యాకయ్య మృతి లోటన్నారు.


యాకయ్య (ఫైల్)